సాక్షి మంచిర్యాల

గురువారం : 14 : ఆగస్టు : 2025



మళ్లీ పొడిగింపేనా..?

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల గడువు ఈ నెల 14న ముగియనుంది. ఎన్నికల నిర్వహణకు అవకాశం లేకపోవడంతో మరోసారి పొడిగించే అవకాశం ఉంది. 8లో▸



..నిందితుడి అరెస్టు 8లో▸

మైక్రో ఫైనాన్స్ పేరిట ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పెద్దయెత్తున మోసం చేసిన నిందితుడిని ఆదిలాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు.

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

పంద్రాగస్టుకు అతిథులు వీరే..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అతిథులను ఖరారు చేసింది. శుక్రవారం ఉదయం 9.30గంటలకు జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం పలు కార్యక్రమాలకు హాజరు కానున్నారు.

ఆదిలాబాద్	మహ్మద్ అలీషబ్బీర్ ప్రభుత్వ సలహాదారు
ఆసిఫాబాద్	బండప్రకాశ్ డిప్యూటీ చైర్మన్, శాసన మండలి
మంచిర్యాల	హర్కర వేణుగోపాల్‌రావు ప్రభుత్వ సలహాదారు
నిర్మల్	సిరిసిల్ల రాజయ్య చైర్మన్, రాష్ట్ర ఆర్థిక సంఘం

భూభారతి అర్జీలు పరిష్కరించాలి



పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

భీమారం: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. భూభారతి దరఖాస్తులు, ఎన్ని పరిష్కరించారని తహసీల్దార్ సదానందంను అడిగి తెలుసుకున్నారు. పెడింగ్‌లో పెట్టకుండా ప్రతీ అర్జీ పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. నాయబ్ తహసీల్దార్ అంజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బహుజన రాజ్య స్థాపననే లక్ష్యం



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

పాతమంచిర్యాల: తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యం స్థాపించడమే లక్ష్యమని డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ ఆవిర్భావ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల రాజ్యాన్ని కూల్చి బహుజన రాజ్యం నిర్మించడం కోసమే మా భూమి రథయాత్ర ద్వారా ప్రజలను చైతన్యపరిచి రాజకీయ చైతన్యాన్ని బహుజనుల్లో నింపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎదునూరి రమేష్, సదానందం, సుదమళ్ల హరికృష్ణ, పడాల రామన్న, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎరువుల కోసం బారులు



చెన్నూర్‌లో గుమిగూడిన రైతులు

చెన్నూర్/కోటపల్లి: ఎరువుల కోసం రైతులు బారులు తీరుతున్నారు. చెన్నూర్ ప్రాథమిక సహకార సంఘం గోదాం వద్ద రైతులు ఎరువుల కోసం ఎదురు చూశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు, మహిళా రైతులు సాయంత్రం వరకు అక్కడే ఉన్నారు. 4గంటలకు ఒక లారీ ఎరువులు వచ్చినా పంపిణీ చేయకపోవడంతో ఆందోళనకు దిగారు. ఎరువులు పంపిణీ చేయాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదని చెల్లాయిపేటకు చెందిన రైతు మహేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోటపల్లిలో బుధవారం యూరియా వచ్చిందనే సమాచారంతో రైతులు ఉదయాన్నే రైతువేదిక వద్ద బారులు తీరారు. ఏడీఏ ప్రసాద్ యూరియా బస్తాలు అందజేశారు. యూరియా లభిస్తుందో లేదోననే బెంగతో ఒక్కసారిగా రైతులు ఎగబడడంతో తోపులాట జరిగింది.

భీమిని మండలం చిన్న తిమ్మాపూర్ ప్రాంతంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న ఎర్రవాగు



జోరు వాన

- జిల్లాలో 93 మిల్లీమీటర్ల వర్షపాతం
- రెండు మండలాల్లో రికార్డు స్థాయిలో వర్షం
- 36 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పొంగిన వాగులు, నిండుతున్న కుంటలు
- వేల ఎకరాల్లో నీట మునిగిన పత్తి పంట
- మరో మూడు రోజులు వర్ష సూచన

మంచిర్యాలఅగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కుండపోత వర్షం కురిసింది. 93.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. భీమిని, కన్నెపల్లి, తాండూర్, బెల్లంపల్లి, నెన్నెల, వేమనపల్లి మండలాల్లో రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు నేలకూలడంతో పలు ప్రాంతాల్లో రాత్రి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో వేల ఎకరాల్లో పత్తి, వరి పంటలు నీట మునిగాయి. చేన్లు కోతకు గురికాగా, పత్తి మొక్కలపై ఇసుక మేటలు వేయడంతో రైతులు నష్టపోయారు. రహదారుల మధ్యలో ఉన్న కల్వర్టులపై నుంచి వరద నీరు ప్రవహించింది. కన్నెపల్లి మండలం పీపీ రావు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌తో సాలిగాం గ్రామంలోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో నిత్యావసర సరుకులు, వస్తువులు తడిసిపోయాయి. అధికారులు అప్రమత్తమై ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. భీమిని మండలంలో ఎర్రవాగు ఉప్పొంగడంతో చిన్న తిమ్మాపూర్ గ్రామ పరిసర ప్రాంతాల్లోని పత్తి



భీమిని: చిన్నతిమ్మాపూర్‌లో మునిగిన పత్తి పంట

చేన్లలోకి వరద నీరు చేరి నీట మునిగాయి. గత రెండ్రోజులుగా జోరుగా కురుస్తున్న వర్షాలతో సింగరేణి ప్రాంతాల్లోని ఓపెన్‌కాస్టుల్లోకి వరద నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నదిలో నీటి ప్రవాహ ఉధృతి పెరుగుతోంది.

36 గ్రామాలకు నిలిచిన రాకపోకలు..

కన్నెపల్లి, కోటపల్లి, వేమనపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, చెన్నూర్ మండలాల్లో వాగులు పొంగి ప్రవహించడంతో 27గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శాశ్వత వంతెన పూర్తి కాకపోవడంతో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన తెగిపోవడంతో గ్రామాలకు రవాణా స్తంభించింది. భీమిని మండలంలో ఎర్రవాగు పొంగి ప్రవహించడంతో మండల కేంద్రంతోపాటు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తొమ్మిది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని పత్తి చేన్లకు వరద నీరు చేరి మునిగాయి. జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులతోపాటు చెరువులు, కుంటల్లోకి నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలస్యంగానైనా వరినాట్లకు సిద్ధం అవుతున్నారు.

భీమినిలో అత్యధికంగా 23 సెంటీమీటర్లు

జిల్లాలోని భీమిని, కన్నెపల్లి మండలాల్లో రికార్డు



కన్నెపల్లి: సాలిగాంలో ఇళ్లలోకి బ్యాక్‌వాటర్

స్థాయిలో భారీ వర్షం కురిసింది. భీమినిలో 232.6 మిల్లీమీటర్లు, కన్నెపల్లి మండలంలో 203.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జన్నారం మండలంలో 48.8 మిల్లీమీటర్లు, దండేపల్లిలో 54.4, లక్సెట్టిపేటలో 58, హాజీపూర్‌లో 59.4, కాసిపేటలో 92.3 తాండూర్‌లో 178.7, వేమనపల్లిలో 97.8, నెన్నెలలో 137.5, బెల్లంపల్లిలో 145.5, మందమర్రిలో 46.6, మంచిర్యాలలో 68.8, నస్పూర్‌లో 61.4, జైపూర్‌లో 55.6, భీమారంలో 38.7, చెన్నూర్‌లో 30.4, కోటపల్లిలో 67.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 603.2 మిల్లీమీటర్లు కాగా 481.1 మిల్లీమీటర్లు కురిసింది. జిల్లా సగటున ఇంకా 20 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం నెలకొంది.

3,436 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం కురిసిన భారీ వర్షానికి 3,436 ఎకరాల్లో పత్తి, వరి పంటలు నీటమునిగి నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక సర్వేలో గుర్తించారు. కన్నెపల్లి, భీమిని, వేమనపల్లి, నెన్నెల, తాండూర్ మండలాల్లో 917 మంది రైతుల చెందిన 1,434 ఎకరాల్లో వరి పంట, 1221 మంది రైతులకు చెందిన 2,002 ఎకరాల పత్తిపంట ఎదిగే దశలో నీట మునిగినట్లు గుర్తించారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్



ఖర్జీభీంపూర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లో ముంపు ప్రాంతాలను కలెక్టర్ కుమార్ దీపక్ సబ్ కలెక్టర్ మనోజ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. కన్నెపల్లి మండలం సాలీగాం పీపీ రావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ఇళ్లలోకి నీరు చేరగా.. వారు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు ఏర్పాటుతో తమకు నష్ట పరిహారం రాలేదని బాధితులు మొర పెట్టుకున్నారు. నష్ట పరిహారం రాని వారి జాబితా తయారు చేసి పంపించాలని తహసీల్దార్ శ్రవణ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. మేరీమాత పాఠశాలలో పునరావాసం, సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. భీమిని మండలం ఖర్జీభీంపూర్, రాజారాం గ్రామాలకు వెళ్లే రోడ్డు కోతకు గురి కాగా పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. చిన్న తిమ్మాపూర్, తంగళ్లపల్లి గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. ఎంపీడీవోలు గంగామోహన్, శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు బికర్ణదాస్, శ్రవణ్‌కుమార్, ఎస్సైలు విజయ్‌కుమార్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

మరో మూడు రోజులు వర్ష సూచన

జిల్లాలో మరో మూడు రోజులు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. 14న 50నుంచి 60 మిల్లీమీటర్లు, 15న 30నుంచి 40 మిల్లీమీటర్లు, 16న 20 నుంచి 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.

ఎవరూ బయటకు రావొద్దు

- రానున్న 72గంటలు భారీ వర్షాలు
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం: రానున్న 72గంటల్లో భారీ వర్షసూచన నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిందని తెలిపారు. పోలీసు యంత్రాంగం 24గంటలూ అప్రమత్తంగా, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా ఆపద, వరదలో చిక్కుకుంటే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. పర్యాటకులు డ్యామ్‌లు, జలపాతాల వద్దకు వెళ్లకూడదని, లోతట్టు ప్రాంతాలపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. నీటి ప్రవాహం పెరిగే చోట ప్రమాద స్థలాలను గుర్తించి బారికేడ్లు, ప్లాస్టిక్ కోన్స్, హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

'ఎల్లంపల్లి'కి వరద



ఎల్లంపల్లి జలాశయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీరు చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు 14టీఎంసీల నీటిమట్టంతో ఉంది. కడెం ప్రాజెక్టు నుంచి 11,500 క్యూసెక్కుల, ఎగువ ప్రాంతాల నుంచి 7,600 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 330 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కులు వదులుతున్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

మంచిర్యాలఅగ్రికల్చర్: భారీ వర్షాల వాతావరణ సూచన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు సెలవు పాటించాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. మందమర్రి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కార్మెల్ డిగ్రీ కాలేజీ భవనాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధే ధ్యేయంగా అనేక కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని అన్నారు. కాకా అంబేద్కర్ విద్యాసంస్థల్లో ఐదువేల మంది విద్యార్థులకు ఎలాంటి డొనేషన్లు తీసుకోకుండా విద్యనందిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లు తగ్గించారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

అసెంబ్లీలో ఆమోదం తెలిపి గవర్నర్ ద్వారా రాష్ట్రపతి వరకు పంపించి నాలుగు నెలలు గడుస్తోందని, అయినా కేంద్ర ప్రభుత్వం కావాలనే తాత్సారం చేస్తోందని అన్నారు. బీసీలపై బీజేపీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్చ్ బిషప్ కార్డినల్ ఆంథోని, ఆదిలాబాద్ బిషప్ ప్రిన్స్ ఆంథోని, బిషప్ జోసఫ కున్నత్, ఫాదర్ రెక్స్, ఫాదర్ జిజో తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అభ్యసనం విద్యార్థులకు వరం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వం ముందు చూపుతో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత అభ్యసనం కల్పించిందని, సాంకేతిక అభ్యసనం విద్యార్థులకు ఒక వరమని డీఈవో యాదయ్య అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాలో ఎంపిక చేసిన ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు గణితం బోధించే ఉపాధ్యాయులకు సాంకేతిక అభ్యసనంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అన్ని ప్రాథమిక పాఠశాలలకు కంప్యూటర్లు అందిస్తామని, వాటి ద్వారా నాణ్యమైన బోధన, స్వీయ అభ్యసన సులభతరం అవుతుందని తెలిపారు. శిక్షణ అంశాలను ఉపాధ్యాయులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, క్వాలిటీ కో–ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

కేజీబీవీల నిర్వహణకు ముందస్తు బడ్జెట్ ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీ, యూఆర్ఎస్‌ల నిర్వహణకు ముందస్తు బడ్జెట్ ఇవ్వాలని డీఈవో యాదయ్యకు స్పెషల్ ఆఫీసర్లు వినతిపత్రం అందజేశారు. గ్యాస్ రిఫిల్ క్రెడిట్ బేస్‌లో పంపిణీ చేయాలని, ఎస్‌వోలకు రూ.32,500 వేతనంతో చాలా ఇబ్బందిగా మారిందని, విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.30వేల నుంచి రూ.60వేల వరకు ప్రతీ పాఠశాలకు బడ్జెట్ రిలీజు చేయాలని కోరారు. కేజీబీవీల ఎస్‌వోలు ఏ.సుమలత, ఫణిబాల, మయూరి, కనకలక్ష్మీ, జె.స్వప్న, మౌనిక, రజిత, సునీత, సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- భారీ వాహనాల రాకపోకలకు పచ్చజెండా

జన్నారం: ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం జన్నారం అటవీ డివిజన్ గుండా భారీ వాహనాల రాకపోకలను జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్‌తో కలిసి ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. భారీ వాహనానికి అటవీశాఖ ఇస్తున్న రూ.150 రశీదును లారీ యజమానికి అందజేశారు. అనంతరం జన్నారం వరకు లారీలో ప్రయాణించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, అటవీశాఖ అధికారులు ఎమ్మెల్యేను సన్మానించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాకపోకలపై నిషేధం ఎత్తివేతకు కృషి చేస్తానని ఏడాది క్రితం హామీ ఇచ్చానని, అప్పటి నుంచి ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి, అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వైల్డ్‌లైఫ్ బోర్డు సమావేశంలో అధికారులపై ఒత్తిడి తెచ్చానని, చివరికి రాకపోకలపై నిషేధం ఎత్తివేయడం శుభపరిణామమని అన్నారు. పగటిపూట రాకపోకలు సాగించే వాహనాల డ్రైవర్లు, యజమానులు అటవీ శాఖ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. అతివేగంగా వెళ్లి వన్యప్రాణులకు హాని కలిగించవద్దని సూచించారు. రాజకీయ లబ్ధి కోసం కొందరు అనవసర ఆరోపణలు చేశారని అన్నారు. రేంజ్ అధికారి సుష్మారావు, డీఆర్వో సాగరిక, ఎస్సై అనూష, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసీఉల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నాయకులు ఇసాక్, శంకరయ్య, రియాజోద్దీన్, శాఖీర్‌అలీ, ముజ్జు, స్వామి, అజార్ పాల్గొన్నారు.



భారీ వాహనాల రాకపోకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్, డీఎఫ్‌వో శివ్ ఆశిష్‌సింగ్

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాలక్రైం: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్–2025 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కమిషనరేట్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీస్ అధికారులు, విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు, మహిళలతో మాదక ద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణా సరఫరా, సాగు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, యాంటీ నార్కోటిక్ సీఐ రాజ్‌కుమార్, సీసీఆర్బీ సతీష్, పీసీఆర్ సీఐ రవీందర్, సీసీఎస్ సీఐ బాబురావ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఓరియంట్‌లో గుర్తింపు ఎన్నికలు

- ఐదు రోజుల గడువులోనే..
- 19న పోలింగ్, ఫలితాల వెల్లడి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ఎట్టకేలకు నగారా మోగింది. ఈ నెల 19న ఎన్నికల నిర్వహణకు ఆదిలాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు 15రోజుల్లో ఎన్నికలు నిర్వహించి, ఈ నెల 20న పూర్తి వివరాలు అందించాల్సి ఉండగా.. 19న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎన్నికలు నిర్వహించి సాయంత్రం ఫలితాలు ప్రకటిస్తారు. ఎన్నికల్లో 257మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 266మంది జాబితా సిద్ధం చేయగా..పలువురి అభ్యంతరాల మేరకు నూతన ఉద్యోగులు తొమ్మిది మందికి ఓటు హక్కు నిరాకరించారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో



ఓరియంట్ సిమెంట్ కంపెనీ

పాల్గొనేందుకు ఐదు యూనియన్లు అర్హత సాధించాయి. ఈ నెల 14న మధ్యాహ్నం 12గంటల్లోపు ఆసక్తి లేని యూనియన్లు తమ అభిప్రాయం తెలియజేస్తే పోటీలో లేకుండా బ్యాలెట్ పేపర్‌పై గుర్తు తొలగిస్తామని, లేనిపక్షంలో గుర్తు కొనసాగుతుందని కార్మిక శాఖ అధికారులు ప్రకటించారు. నాలుగేళ్లుగా ఎన్నికల కోసం ఎదురు చూస్తుండగా.. ఐదు రోజుల్లోనే ఎన్నికల నిర్వహణ ముగియనుండడంతో కార్మికులు, కార్మిక సంఘాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పోటీలో రెండే యూనియన్లు

ఈ నెల 19న జరిగే ఓరియంట్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో రెండు యూనియన్లు మాత్రమే పోటీలో నిలిచే అవకాశం ఉంది. ఐదు యూనియన్లు అర్హత సాధించినా అధికార పార్టీ నాయకులు ప్రధానంగా పోటీ పడుతుండడంతో మిగతా యూనియన్లు వారికి మద్దతుగా నిలువనున్నాయి. పోటీలో క్రియాశీలకంగా ఉండనప్పటికీ గురువారం కార్మిక శాఖకు విత్‌డ్రా సమాచారం అందించకుండా ఐదు గుర్తులు కొనసాగే అవకాశం ఉంది.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

భీమిని: భారీ వర్షాల నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భీమిని, కన్నెపల్లి మండలాల వైద్య సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, పీహెచ్‌సీ వైద్యుడు అనిల్‌కుమార్, సీహెచ్‌వో జలపతి, హెచ్‌వీ ఇందిరా, హెల్త్ అసిస్టెంట్ ఉమాశంకర్ పాల్గొన్నారు.

'వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకోవాలి'

పాతమంచిర్యాల: ఇంగ్లండ్, అమెరికాలతో భారత్ చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు వెంటనే రద్దు చేసుకోవాలని అఖిల భారత కేత్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు. బుధవారం బహుళ జాతి కంపెనీల అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుపతి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, ఉపాధ్యక్షుడు చందు పాల్గొన్నారు.



ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

క్లుప్తంగా

'నవోదయ'లో ప్రవేశానికి గడువు పొడిగింపు

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి గానూ ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న అర్హత పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27 వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుకు సత్కారం



సన్మానిస్తున్న విద్యాసంచాలకులు

ఆసిఫాబాద్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2025 కోసం బుధవారం హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాసంచాలకుల కార్యాలయంలో జాతీయ స్వతంత్ర్య జ్యూరీ నిర్వహించారు. కుమురంభీం జిల్లా నుంచి జన్కాపూర్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ధర్మపురి వెంకటేశ్వర్లు ముఖాముఖిలో పాల్గొన్నారు. రాష్ట్ర నుంచి 160 మంది దరఖాస్తు చేసుకోగా ఆరుగురిని ఎంపిక చేశారు. ఇందులో వెంకటేశ్వర్లు ఒకరు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు పాఠశాల విద్యా ప్రగతిని, విద్యార్థుల ప్రగతిలో వినూత్న సేవలను వివరించారు. అనంతరం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ ఉపాధ్యాయుడిని శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు మదన్‌మోహన్, ఆర్‌జేడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నారిపై వీధికుక్క దాడి



గాయాలపాలైన మల్లెల కౌశిక్

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో బాలుని పై వీధికుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన మల్లెల శ్రీకాంత్–శిరీష దంపతుల కుమారుడు కౌశిక్ మంగళవారం ఇంటిముందు ఆడుకుంటుండగా వీధికుక్క వచ్చి దాడి చేసింది. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు బాలుడిని నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

ఆదిలాబాద్‌రూరల్: భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కే.ప్రభాకర్‌రావు బుధవారం తీర్పునిచ్చినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన జాదవ్ ఆనంద్‌రావు మద్యం సేవించి ఇంటికి వచ్చి తరచూ భార్యతో గొడవపడేవాడు. ఇదేక్రమంలో తలపై సుత్తెతో కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. దంపతుల కుమారుడు మహేష్ 18 డిసెంబర్ 2024న పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై విష్ణువర్ధన్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారి సంతోష్ 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెల్లడించారు.

మళ్లీ పొడిగింపేనా?

- ఫిబ్రవరిలో ఆరు నెలలు పెంచిన ప్రభుత్వం
- నేటితో ముగియనున్న సొసైటీ పాలకవర్గాల గడువు
- జాతీయ పతాకావిష్కరణపై చైర్మన్ల ధీమా



తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వివరాలు

సహకార సంఘాలు	:	77
డీసీసీబీ	:	01
డీసీఎంఎస్	:	01
సొసైటీల పరిధిలోని సభ్యులు	:	55 వేలు

కైలాస్‌నగర్/నిర్మల్‌చైన్‌గేట్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల గడువు ఈ నెల 14న ముగియనుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే వీటి గడువు ముగిసినప్పటికీ డీసీసీబీ చైర్మన్ల విజ్ఞప్తి మేరకు ఆరునెలల పాటు అదనంగా పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గడువు సైతం గురువారంతో ముగియనుంది. ప్రస్తుతం వీటికి ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదు. దీంతో సొసైటీ పాలకవర్గాల గడువు పెంపు మరోసారి అనివార్యం కానుంది. ప్రత్యేకాధికారులను కూడా నియమించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం అందుకు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. పంద్రాగస్టు వేడుకల్లో తామే జాతీయ పతాకాన్ని ఎగురవేస్తామని సొసైటీ చైర్మన్లు ధీమా వ్యక్తం చేస్తుండటంతో పాలకవర్గాల గడువు మరోసారి పొడిగింపు ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రెండోసారి పదవీకాలం పొడిగింపు?

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 77 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)కు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 14న ఎన్నికలు నిర్వహించింది. సొసైటీ పరిధిలో ఎన్నికైన చైర్మన్‌లతో అదే నెల 25న డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఎన్నికలు నిర్వహించారు. వీరితో పాటు పలువురు డైరెక్టర్లను సైతం ఎన్నుకున్నారు. కాగా ఈ సొసైటీలకు ఎన్నికలు జరిగి ఈ ఏడాది ఫిబ్రవరి 14వ తేదీతో ఐదేళ్ల గడువు పూర్తయ్యింది. దీంతో వాటి కాలపరిమితి ముగియడంతో రాష్ట్రంలోని డీసీసీబీ చైర్మన్లంతా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రితో పాటు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ పదవీకాలాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం ఆరునెలల పాటు పదవీకాలాన్ని పొడిగించింది. తాజాగా ఈ గడువు నేటితో ముగియనుంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడంతో మరోసారి తమ పదవీకాలాన్ని పొడిగించాలని డీసీసీబీ చైర్మన్లతో పాటు సొసైటీ చైర్మన్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతో మరోసారి మూడు లేదా ఆరునెలల పాటు పదవీకాలం పొడిగిస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పదవీ కాలం ముగియడంతో 15వ తేదీన జరిగే పంద్రాగస్టు వేడుకల్లో చైర్మన్ల హోదాలో జాతీయ పతాకావిష్కరణ చేసే అవకాశం ఉండదు. అయితే ప్రభుత్వం ఎలాగైనా తమ పదవీకాలాన్ని పొడిగిస్తుందనే ధీమాలో ఉన్న సొసైటీ చైర్మన్లు తామే మువ్వన్నెల పతాకాన్ని ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

అన్నదాతకు వెన్నుదన్నుగా ...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 77 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 55 వేలకు పైగా రైతులు ఉన్నారు. వారికి వ్యవసాయ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పంట రుణాలను క్షేత్రస్థాయిలో అందజేస్తూ సొసైటీలు వారికి అండగా నిలుస్తున్నాయి. పలు సొసైటీలు ధాన్యం కొనుగోళ్లను సైతం చేపడుతున్నాయి. ఈ సొసైటీలన్నీ కూడా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ), జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ (డీసీఎంఎస్) ఆధ్వర్యంలోనే పనిచేస్తున్నాయి.

అవకాశముంది

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల గడువు ఈ నెల 14తో ముగియనుంది. ఇటీవలే ఆరు నెలల పాటు సొసైటీల గడువును ప్రభుత్వం పొడిగించింది. మరోసారి సైతం పదవీకాలాన్ని పొడిగించేందుకే ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై గురువారం ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశముంది. – బి.మోహన్, జిల్లా సహకార శాఖ అధికారి, ఆదిలాబాద్

వివాహానికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

- బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి
- మృతుల్లో ఒకరు కానిస్టేబుల్



ముచ్చకుర్తి అనిల్ (ఫైల్)



మేడి గణేశ్ (ఫైల్)

వెల్గటూర్: అప్పటివరకూ స్నేహితుడి వివాహ వేడుకలో అందరితో కలిసి ఆనందంగా గడిపిన ఆ యువకులు.. ఇంటికి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది. పోలీసులు, స్థానికుల కథనం వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం ఇటిక్యాలకు చెందిన ముచ్చకుర్తి అనిల్(26), మేడి గణేశ్ (26) ఇద్దరు స్నేహితులు. ద్విచక్రవాహనంపై ఎండపల్లి మండల కేంద్రంలో బుధవారం జరిగిన స్నేహితుడి వివాహానికి హాజరయ్యారు. రాత్రిపూట స్వగ్రామమైన ఇటిక్యాలకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. వెల్గటూర్ మండలం పాశిగామ స్టేజీ వద్ద లక్సెట్టిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వస్తోంది. అదే సమయంలో రోడ్డుపైకి ఓ గేదె రావడంతో బస్సు గేదెను ఢీకొంది. బస్సు డ్రైవర్ గేదెను తప్పించే క్రమంలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ ఉన్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. అనిల్ ఇటీవలే కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఉద్యోగం చేస్తున్నాడు. గణేశ్ హైదరాబాద్‌లో వండర్ లాలో పనిచేస్తున్నట్లు సమాచారం. గణేశ్‌కు సోదరి ఉంది. తల్లిదండ్రులు గ్రామంలో కూలీ పని చేసుకుని జీవిస్తున్నారు. అనిల్ తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం ముంబయి వలస వెళ్లారు. ప్రభుత్వ ఉద్యోగం రావడంతో వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఆ తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉద్యోగాల పేరిట మోసగించిన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ఎస్‌కే మైక్రోఫైనాన్స్ పేరిట ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పెద్ద ఎత్తున మోసం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇంద్రవెల్లి మండలంలోని శంకర్‌గూడకు చెందిన జవాడే కృష్ణ అలియాస్ జాదవ్ కృష్ణ ఎన్ఆర్ఐ అంటూ సామాజిక సేవ పేరుతో పరిచయాలు పెంచుకొని మైక్రో ఫైనాన్స్, ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్నాడు. 2024 డిసెంబర్‌లో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ఉట్నూర్‌లో మైక్రో ఫైనాన్స్ పేరుతో కార్యాలయాలను ప్రారంభించి జిల్లా వ్యాప్తంగా 300 మంది నుంచి రూ.20 వేల చొప్పున మెంబర్‌షిప్ చేయించాడు. రెండు కార్యాలయాల్లో ఐదుగురు ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని నిరుద్యోగుల నుంచి రూ.69 లక్షలు వసూలు చేశాడు. ఆరునెలల పాటు కనిపించకపోవడంతో జూలైలో నిరుద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శంకర్‌గూడలో రూ.9 లక్షల నగదు, రూ.3లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఇంట్లోనే దాచిపెట్టి రూ.15 లక్షలతో పరారయ్యాడు. నిందితుడిని భోరజ్ చెక్‌పోస్టు వద్ద అరెస్ట్ చేసి రూ.9లక్షల నగదుతో పాటు 10.7 తులాల బంగారు ఆభరణాలతో పాటు ఐదు సెల్‌ఫోన్లు, ఒక ఖరీదైన వాచ్, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రజల నుంచి విడతల వారీగా వసూలు చేసి మోసం చేసిన డబ్బుల్లో రూ.6లక్షలు ఆదిలాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్ యజమానికి ఇచ్చాడని, మరో రూ.6లక్షలు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో భవన యజమానికి, రూ.3.5 లక్షలు ఆదిలాబాద్, ఉట్నూర్ కార్యాలయాల నిర్వహణకు, రూ.2.1 లక్షలు నిందితుడి తమ్ముడి అవసరాల నిమిత్తం ఇచ్చినట్లు తెలిపారు. మిగితా డబ్బులు జల్సాల కోసం, తప్పించుకోవడానికి ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నిందితుడు కరోన సమయంలో ముంబాయ్‌లో ఫేక్ రెమిడి ఇంజక్షన్లను విక్రయించాడని, నాగ్‌పూర్‌లో రుణాల పేరిట అక్కడి ప్రజలను మోసం చేశాడని తెలిపారు. నిందితుడిపై ఉట్నూర్‌లో 3, ఇంద్రవెల్లిలో 3, నార్నూర్‌లో 2, మావల పోలీసు స్టేషన్‌లో 3, ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో 2, జైనథ్‌లో 3 చొప్పున కేసులు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ ఎం.ప్రసాద్, ఐటీకోర్ ఎస్సై గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఐచర్ ఢీకొని వ్యక్తి మృతి

- న్యాయం చేయాలని రహదారిపై బైఠాయించిన కుటుంబ సభ్యులు



ప్రభుదాస్ మృతదేహం



రహదారిపై బైఠాయించిన కుటుంబ సభ్యులు

తానూరు: భైంసా–నాందేడ్ రహదారిపై బెల్‌తరోడా ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం ఐచర్ వాహనం ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. మహలింగి గ్రామానికి చెందిన బన్సోడే ప్రభుదాస్ (35) భార్య లక్ష్మి, కుమారుడు అరుతో కలిసి భైంసాకు వెళ్లాడు. బుధవారం స్వగ్రామానికి వెళ్లేందుకు బెల్‌తరోడా ఎక్స్‌రోడ్డు వద్ద బస్సు దిగారు. భార్య, కుమారుడిని అక్కడే కూర్చోబెట్టి మక్కబుట్టా తీసుకువచ్చేందుకు రోడ్డు దాటుతుండగా భైంసా నుంచి నాందేడ్ వైపు అతివేగంగా వెళ్తున్న ఐచర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం ఆపకుండా వెళ్తుండడంతో స్థానికులు వెంబడించి మహారాష్ట్ర సరిహద్దులోని రాతి గ్రామ శివారులో పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై షేక్ జుబేర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

న్యాయం చేయాలని రహదారిపై బైఠాయింపు

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు రహదారిపై బైఠాయించారు. డ్రైవర్ అజాగ్రత్తతోనే ప్రమాదం చోటు చేసుకుందని, పరిహారం అందేవరకూ ఇక్కడి నుంచి కదిలేదిలేదని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై ఆందోళనకారులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

కడెం కెనాల్‌లో పడి ఒకరు మృతి



నర్సయ్య మృతదేహం

దండేపల్లి: మద్యం మత్తులో కడెం కెనాల్‌లో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సేదం నర్సయ్య (48) కూలీ పని నిమిత్తం దండేపల్లి మండలంలోని కుంటలగూడకట్టకు చెందిన తన బంధువైన బొబ్బిలి బక్కవ్వ ఇంటికి వచ్చాడు. మంగళవారం మద్యం సేవించి కడెం కెనాల్ సమీపంలో ఓ చెట్టు కింద కూర్చున్నాడు. ఆతరువాత కొద్దిసేపటికి అతను కనిపించకపోవడంతో బంధువులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ కోసం వెతుకుతుండగా బుధవారం కుంటలగూడకట్ట సమీపంలోని కడెం కెనాల్ లో చెట్లపొదలకు తట్టుకుని మృతదేహం దొరికింది. మద్యం మత్తులో ప్రమాద వశాత్తు కెనాల్‌లో జారిపడడంతో ఈత రాక నీటిలో మునిగి మృతి చెందాడని మృతుని బంధువు భూమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



నారాయణ (ఫైల్)

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీ వ్రంగా గాయపడిన వెన్నెల నారాయణ (51) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీ సులు తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్ మండలంలోని యాపల్‌గూడకు చెందిన నారాయణ మంగళవారం ఉదయం తన మోటార్ సైకిల్‌పై అడెల్లి పోచమ్మ దర్శనానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో స్థానిక శర్మ దాబా వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చే సి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారి రాజు, ఏఎస్సై రంగారావు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని సింగరేణి కార్మికుడు..

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మందమర్రిలోని గాంధీనగర్‌కు చెందిన సాయి వెంకటేష్ (28) అనే సింగరేణి కార్మికుడు మృతి చెందాడు .శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–7 గనిలో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటేష్ బైక్‌పై మంచిర్యాల నుండి మందమర్రి వైపు వెళ్తుండగా బొక్కలగుట్ట వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుని తండ్రి బానేష్ గతంలోనే అనారోగ్యంతో మృతి చెందగా తల్లి అన్నపూర్ణ అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది.

గూడ్స్ రైలు ఢీకొని ఒకరు..



వెంకటేష్ (ఫైల్)

సిర్పూర్(టి): ఆరెగూడ సమీపంలో డౌన్‌లైన్‌పై ఆపోజిషన్ డైరెక్షన్లో రైల్వే కాంట్రాక్ట్ లేబర్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గూడ్స్ రైలు రివర్స్‌లో వచ్చి ఢీకొనడంతో షేక్ జంషేడ్ (44) అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం 5.40 గంటలకు షేక్ జంషేడ్, ప్రవీణ్, పర్వేస్ నైట్ పెట్రోలింగ్ చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రవీణ్‌కు చేయి విరగడంతో హైదరాబాద్‌కు తరలించారు. కాగజ్‌నగర్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కె.సురేష్ గౌడ్ విచారణ జరిపారు. షేక్ జంషేడ్ మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఒకరిపై వేధింపుల కేసు

జైనథ్: అదనపు కట్నం కోసం వేధించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రంగ బాలరాజు గౌడ్ కుమార్తె స్రవంతికి అంకోలి గ్రామానికి చెందిన బాలాజీతో 2018లో వివాహమైంది. కొంత కాలం తర్వాత అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో రెండు సంవత్సరాల క్రితం స్రవంతి పుట్టింటికి వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. వారం రోజుల క్రితం బాలాజీ జైనథ్‌కు వచ్చి చంపుతానని బెదిరించడంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో లారీ డ్రైవర్ ఆత్మహత్య



మహమ్మద్ రంజాన్ (ఫైల్)

కాసిపేట: అప్పులబాధతో లారీ డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కాసిపేట పోలీస్‌స్టేషన్ పరి ధిలోని సోమగూడెం ఇందిరమ్మ కాలనీకి చెందిన మహమ్మద్ రంజాన్(41) ఇటీవల లారీని కొనుగోలు చేయడంతో అప్పులపాలయ్యాడు. ఈనెల 12న శ్రీరాంపూర్‌లో ఆర్టీసీ బస్సుతో యాక్సిడెంట్ అయిందని కుటుంబ సభ్యులతో చెప్పి బాధపడ్డాడు. ఇప్పటికే అప్పుల పాలైన తాను యాక్సిడెంట్‌తో మరింత అప్పులు పెరుగుతుండడంతో మానసికంగా కుంగిపోయి బుధవారం ఉదయం తన ఇంటిముందు రేకులకు ఉంగీతో ఉరేసుకున్నాడు. మృతుని కుమారుడు హసన్‌బాబా ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

నేరడిగొండ: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోలంకి శ్రీకాంత్ (26) మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన పేర్కొన్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఫాస్టాగ్ తరహాలో టైగర్ జోన్ ఎంట్రీ ఫీజు

కడెం: టోల్‌గేట్ మాదిరిగా ఫాస్టాగ్ తరహాలో చెక్‌పోస్ట్‌ల వద్ద సెస్ వసూలు చేసేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. కవ్వాల్ టైగర్ జోన్ గుండా ప్రయాణించే వాహనాలకు చెక్ పోస్టుల వద్ద ఎన్విరాల్‌మెంట్ సెస్ వసూలు చేస్తున్నారు. గతంలో టైగర్‌జోన్ పరిధిలో భారీ వాహనాలకు అనుమతులు లేవు. ఇటీవలే అనుమతులు ఇచ్చిన విషయం తెలిసిందే. పాండ్వపూర్ లోని చెక్‌పోస్ట్ వద్ద టైగర్‌జోన్‌లోకి ఎంట్రీ అయ్యే వాహనాలు ఇప్పటి వరకు సిబ్బంది సెస్ వసూలు చేసేవారు. ఫాస్టాగ్ తరహాలో ఏర్పాటు చేయబోతున్న చెక్‌పోస్ట్‌తో వాహనదారులు వెంటవెంటనే వెళ్లేందుకు వీలుంది.

పోక్సో కేసులో ఒకరికి యావజ్జీవ కారాగార శిక్ష

మంచిర్యాలక్రైం: పోక్సో కేసులో ఒకరికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తి, ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ పోక్సో కోర్టు, న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్ బుధవారం తీర్పునిచ్చినట్లు ఏసీపీ ప్రకాష్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూ మారుతినగర్‌లో నివాసం ఉంటూ ఐస్‌క్రీంలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ బాలుడిని 2018 ఫిబ్రవరి 24న నాతో వస్తే చాలా ఐస్‌క్రీములు ఇస్తానని చెప్పి శాలివాహన ప్లాంట్‌వైపు చెట్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలుడు తప్పించుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో 2018, ఫిబ్రవరి 25న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బబ్లూపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారా గార శిక్షతో పాటు రూ.10వేల జరిమానా, బాధిత కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పునిచ్చింది.

వేర్వేరు చోట్ల గుడుంబా పట్టివేత

కడెం: మండలంలోని పెద్దూర్‌తండాలో బుధవారం తెల్లవారుజామున ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. తండాకు చెందిన భుక్యాశేఖర్ ద్విచక్ర వాహనంపై గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రంగస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై అభిశేఖర్, సిబ్బంది వెంకటేశ్, హరీశ్, సాయి, రాజేందర్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

భీమిని: కన్నెపల్లి మండలంలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను పట్టుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కర్ రావు తెలిపారు. నెన్నెల మండలం మన్నెగూడెం లంబడి తండాకు చెందిన దారావత్ రవీందర్ ద్విచక్ర వాహనంపై పది లీటర్ల గుడుంబాను కన్నెపల్లికి తరలిస్తుండగా కన్నెపల్లి మండలంలో వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలి పారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామానికి చెందిన గోవింద్ ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రంగస్వామి, ఎస్సై అభిషేకర్ తెలిపారు. ఎక్బాల్‌పూర్ నుంచి మామడ మండలం న్యూసాంగ్వికి 8 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడంతో పాటు బైక్‌ను సీజ్ చేశామన్నారు. ఎక్సైజ్ సిబ్బంది సాయి, రాజేందర్, వెంకటేష్, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిస్థలం కబ్జా చేసిన ఎనిమిది మందిపై కేసు



నకిలీ పట్టా చూపిస్తున్న డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: మావల శివారు ప్రాంతంలోని సర్వేనంబర్ 170లో నకిలీ ఇంటి పత్రాలు సృష్టించి ఆ స్థలాన్ని కబ్జా చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన స్వామికి 2013 బీపీఎల్ కింద ప్రభుత్వం 905 నంబర్ గల ఇంటి స్థలాన్ని కేటాయించింది. ఆ స్థలంలో బాధితుడు స్వామి గుడిసె వేసుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం 2015లో అనుమతులు సైతం తీసుకున్నారు. అనారోగ్యం కారణంగా ఇంటి నిర్మాణం చేపట్టలేకపోయాడు. రహెమాన్‌ఖాన్ ఆ స్థలంలో ఉన్న గుడిసెను తొలగించి వెంకటమ్మకు రూ. 2.30 లక్షలకు విక్రయించాడు. వెంకటమ్మ ఆ స్థలాన్ని కిష్టన్నకు రూ.3.50 లక్షలకు విక్రయించింది. బాధితుడు స్వామిని బెదిరింపులకు గురిచేయడంతో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో సుంకరి సంతోష్, రహిమాన్ ఖాన్, తాటి లక్ష్మణ్, కిష్టన్న, పవన్ నాయక్, సుంకరి వెంకటమ్మ, శరత్, వంశీకృష్ణపై కేసు నమోదు చేశారు. ఇందులో నలుగురిని అరెస్టు చేయగా కిష్టన్న పవన్ నాయక్, సుంకరి వెంకటమ్మ, శరత్ పరారీలో ఉన్నారు. సమావేశంలో మావల సీఐ కర్రె స్వామి, ఎస్సై రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై..

నెన్నెల: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. కొందరు యువకులు బొప్పారం అడవిలో గంజాయి సేవిస్తున్నారని అందిన సమాచారం మేరకు వెంటనే దాడి చేయగా మంచిర్యాల గడ్డెరాగడికి చెందిన ఐటీఐ విద్యార్థి పొల్తెపు ప్రణయ్ దొరికిపోయాడు. అతడిని సోదా చేయగా 1.5 గ్రాముల గంజాయి లభించింది. గంజాయితో పాటు పల్సర్ బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు. ప్రణయ్‌తో పాటు పారిపోయిన నెన్నెల మండలం గన్‌పూర్ గ్రామానికి చెందిన పోతురాజుల అకాశ్, గొల్లపల్లికి చెందిన సల్లూరి పెత్రుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్లాట్ ఇస్తానని మోసం చేసిన ఒకరిపై..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ యజమాని సయ్యద్ షాహిద్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. 2008లో నార్నూర్‌కు చెందిన ఎక్బాల్ ఖాన్ షాహిద్ వద్ద రూ.50 వేలకు ఆదిలాబాద్ పట్టణంలో ఓ ప్లాట్ కొనుగోలు చేశాడు. రూ.20వేలు అడ్వాన్స్ ఇవ్వగా రూ.30 వేలు కిస్తులుగా చెల్లించాడు. ఆ తర్వాత ప్లాట్ ఇవ్వకుండా 2016లో మరో వ్యక్తికి విక్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.